క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 64 మందికి పరీక్షలు చేశారు. 8 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యాధికారులు సమద్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



భిక్కనూరు: దివ్యాంగులు ఫిజియోథెరపి చికిత్సను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ జిల్లా అధికారి రమేశ్ బాబు సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలో మహిళ సమాఖ్య దివ్యాంగుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెపపి పరీక్షలను ఆయన పరిశీలించారు. 15 రోజులకు ఒక్కసారి దివ్యాంగులు ఈ కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కే.విజయ్‌కుమార్‌ను గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామస్వామి, ప్రతినిధులు గుండు శ్రీనివాస్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శబరిమాత ప్రతిమ, దివ్యసమాధులను అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని కొచ్చరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాబోయే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ ఓండ్ల మహేందర్ తెలిపారు.

పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రమేశ్ గౌడ్



కామారెడ్డి టౌన్/మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలోని పాల్వంచ మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఫరీద్‌పేట్ రమేష్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసి శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామక పత్రాన్ని అందజేశారు. షబ్బీర్ అలీ గెలుపు కోసం కృషి చేస్తానని రమేష్ గౌడ్ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాచారెడ్డి మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతిని కాపాడిన స్థానికులు

నిజాంసాగర్(జుక్కల్): లింగంపేట మండలానికి చెందిన యువతి ప్రాణాలను శుక్రవారం సుల్తాన్‌నగర్ గ్రామస్తులు కాపాడారు. ఎల్లారెడ్డిలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న యువతి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని యువతి, గ్రామస్తులకు చెప్పడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆ యువతిని గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల వద్దకు క్షేమంగా తీసుకెళ్లి అప్పగించినట్లు తెలిసింది.

రోడ్లపైనే పార్కింగ్..!

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వైనం



బాన్సువాడలో రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు

బాన్సువాడ : రోడ్డు మీదనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై నిత్యం వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు జరిమానాలు విధించినా వారి తీరుమారడం లేదు.

రోజూ ఇదే సమస్య...

పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ నుంచి బస్‌డిపో వరకు రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డుపై ఆటోలు, లారీలు, కార్లు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బస్టాండ్ ప్రాంతంలో ఆటోలు ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలపడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డుపై ఆటోలు నిలపడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాడ్కోల్ రోడ్డుపై లారీలు పార్కు చేసి ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై వాహనాలను పార్కు చేయవద్దని పోలీసులు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. పలుమార్లు జరిమానాలు విధించిన పట్టింపులేని ధోరణితో వ్యవహరిస్తున్నారు. ప్రతి గురువారం బాన్సువాడలో సంత ఉంటుంది. ముఖ్యంగా తాడ్కోల్ చౌరస్తా, వెంకటేశ్వర టాకీసు, ఎస్‌బీఐ వద్ద వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కు చేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు స్పందించి రోడ్డుపై పార్కు చేసిన వాహనాలకు భారీ జరిమానాలను విధించాలని పలువురు కోరుతున్నారు.

నోటుకు, మద్యానికి ఓటు అమ్ముకోవద్దు

- స.హ. చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



వారోత్సవాల్లో పాల్గొన్న ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ఓటు అంటే రూ.500 నోటు, మద్యం ఇస్తే ఎవరికి పడితే వారికి అమ్ముకునేది కాదని, నిజాయితీ ఉన్న నాయకుడ్ని ఎన్నుకునే ఆయుధమని, రాజకీయ నాయకులు ఆశచూపే చిన్న చిన్న ప్రలోభాలకు లోను కావద్దని సమాచార హక్కు(స.హ.) చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న అన్నారు. శుక్రవారం స.హ. చట్టం వారోత్సవాల ముగింపు స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో కేక్ కట్ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. మంచి వారికి ఓటు వేసి ఎన్నుకున్నప్పుడు అవినీతికి ఆస్కారం లేని సమాజం ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు. బీసీ నాయకుడు డాక్టర్ పుట్ట మల్లికార్జున్ ఓటుపై చైతన్యం కల్గించే గేయాలను ఆలపించారు. పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, న్యాయవాది బి.నాగభూషణం, సిర్నాపల్లి ప్రదీప్‌కుమార్, లెగ్గల రాజు, శివపూల లింబయ్య, తదితరులున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



ఎల్లారెడ్డి: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజలు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడవద్దని అన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బ్యాంకు అధికారుల మని ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని అన్నారు. సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, సాయిలు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో ముత్యంపేట గ్రామస్తుల చేరిక



విప్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: దోమకొండ మండలంలోని ముత్యంపేట్ గ్రామం నుంచి పలువురు కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నివాసంలో ఆయన సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని గంప గోవర్ధన్ అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దీన్, దోమకొండ బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత మృతి..ప్రభుత్వ విప్ సంతాపం



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి అర్బన్: లింగాపూర్‌కు చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు బండారి లింగారెడ్డి వృద్ధాప్యంతో గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం అంత్య క్రియలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భిక్కనూరు: ప్రజలు పోస్టల్ పథకాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం భిక్కనూరులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాణిజ్య బ్యాంకుల కంటే పోస్టల్ శాఖ డిపాజిట్లపై అధిక వడ్డీలను అందిస్తోందన్నారు. అలాగే రికరింగ్ డిపాజిట్లపై అధిక వడ్డీని అందజేస్తున్నామని, ప్రజలు గమనించాలన్నారు. సబ్ పోస్ట్ మాస్టర్ రాజేందర్‌రెడ్డి, ఎంవో-2 వెంకట రమణా రెడ్డి, పోస్టల్ సిబ్బంది సురేష్ కుమార్, సుధాకర్, రచన, తదితరులు పాల్గొన్నారు.

రామనే శ్రీరామ ఉయ్యాలో..



ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. రామ రామ నంది ఉయ్యాలో.. రాగమేత్తరాదు ఉయ్యాలో అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోరెత్తించారు. స్కూళ్లు, కాలేజీలతో పాటు ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడి పాడారు. అనంతరం స్థానిక చెరువులు, నీటి కుండీలలో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వెంకట సాయి విద్యానికేతన్‌లో..



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..



భిక్కనూరులో



కామారెడ్డిటౌన్: నిమజ్జనం చేస్తున్న మహిళలు

కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ కురుమ యువచైతన్య సమితి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెట్కూరి భూపాల్, ఉపాధ్యక్షులుగా ఎర్రోళ్ల మహిపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్కూరి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా దొడ్ల కొమురయ్య, కోశాధికారిగా ఎర్రోళ్ల మల్లేష్, ప్రచార కార్యదర్శిగా వంకాయల హరీష్, కార్యదర్శిగా సూర్న శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు. వీరికి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ తదితరులు నియమాకపత్రాలు అందజేశారు.

విద్యార్థులు ఇంటి బాట



పెద్దకొడప్‌గల్/తాడ్వాయి: దసరా సెలవులు ప్రకటించడంలో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, తమ తల్లిదండ్రులతో కలిసి సొంతూళ్లకు బయలుదేరారు..

పోలీసులకు రివార్డులు



నిజాంసాగర్(జుక్కల్): ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసును ఛేధించడంలో కీలక పాత్ర పోషించిన నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్‌తో పాటు కానిస్టేబుళ్లు శ్యాం, వసీ, హోంగార్డు అంజనేయులుకు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి రివార్డులను అందజేశారు. ఆరే గ్రామ పంచాయతీ పరిధి శివారులో ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్, కాపర్ వైర్లను దొంగలించిన ముఠాను పట్టుకోవడంతో కీలకంగా వ్యవహరించడంతో వారి సేవలను డీఎస్పీ జగన్నాథరెడ్డి, రూరల్ సీఐ మురళి కొనియాడారు. ఉత్తమ సేవలు అందించినందుకుగాను నగదును రివార్డుగా అందజేశారు.

గుండా మల్లేష్ ఆశయ సాధనకు కృషి



బాన్సువాడ: సీపీఐ నేత గుండా మల్లేష్ ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు అన్నారు. శుక్రవారం బాన్సువాడలో సీపీఐ కార్యాలయం వద్ద మల్లేష్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల సమస్యలపై పోరాడిన వ్యక్తి గుండా మల్లేష్ అని కొనియాడారు. సమ సమాజ స్థాపన కోసం కృషి చేశారని అన్నారు. సీపీఐ కార్యదర్శి సుధాకర్, విఠల్‌గౌడ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

'కేసీఆర్ మైనార్టీలను మోసం చేశారు'



బాన్సువాడ రూరల్: సీఎం కేసీఆర్ మైనార్టీలను అబద్ధపు హామీలతో మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాలెక్ విమర్శించారు. టీపీసీసీ మైనార్టీ చైర్మన్ అబ్దుల్లా సోహెల్, పీఏసీ చైర్మన్ షబ్బీల్ అలీ ఆదేశానుసారం శుక్రవారం బాన్సువాడ జామే మజీద్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ముస్లీం మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని 2014 ఎన్నికల హామీలో పేర్కొన్న కేసీఆర్ నేటికి నెరవేర్చలేదన్నారు. వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ పవర్స్ ఇస్తామని ఇవ్వలేదని గుర్తుచేశారు. మైనార్టీలకు రూ.100 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఇచ్చి అందులో కనీసం రూ.20 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. సీఎం కేసీఆర్ మోసాలపై సియాసత్ ఉర్దూపత్రికలో వచ్చిన వార్తలను కరపత్రాల రూపంలో పంచిపెట్టారు. నాయకులు అసద్ బిన్ మోసీన్, బుడిమి నబీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఇక్కట్లు

- బెడ్లు సరిపోక అవస్థలు



మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై చికిత్స తీసుకుంటున్న ఇద్దరు రోగులు

మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ పథకాలు, నిధులు ఎన్ని ఇచ్చారన్నది ముఖ్యం కాదు.. నిరుపేదలకు వైద్యం ఎలా అందుతున్నదే అన్నింటి కంటే ముఖ్యమైనది. నిరుపేదలకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం మాట దేవుడెరుగు.. కనీసం బెడ్ దొరకని పరిస్థితి నెలకొంది. మద్నూర్ 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో ఇన్ పెషెంట్ వార్డులో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను పడుకోబెట్టి వైద్యం అందిస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో నిత్యం ఆస్పత్రికి వందల సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుండడంతో గదులు, బెడ్‌లు సరిపోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల వెంట వచ్చిన వారు నేలపైనే కూర్చుంటున్నారని, దీంతో రోగులకు, వారి వెంట వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

అప్‌గ్రేడ్ ఏమైంది ఎమ్మెల్యే సార్..

ఈ ఆస్పత్రిని 30 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని గతంలో గ్రామస్తులు ఆస్పత్రికి చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే హన్మంత్ సింధేను కోరారు. కోరిన వెంటనే ఎమ్మెల్యే హన్మంత్ సింధే సైతం వంద పడకల ఆస్పత్రిగా మారుస్తానని చెప్పి మరిచిపోయారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సాబ్ జర మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి రోగుల గోస చూడడంని గ్రామస్తులు కోరుతున్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్

నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా ఇచ్చే చీరల పంపిణీకి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బ్రేక్ పడింది. ప్రభుత్వం మండలాలు, గ్రామ పంచాయతీల వారీగా బతుకమ్మ చీరలను ముందుగానే సరఫరా చేసింది. కాని జీపీలలో చీరల పంపిణీ ప్రక్రియ ఆలస్యం కావడంతో లబ్ధిదారులకు అందలేదు. బతుకమ్మ పండుగ సమీపించడంతో ఆడపడుచులు చీరల కోసం గ్రామ పంచాయతీలకు తరలి వస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చీరల పంపిణీ ఆపివేయాలని జిల్లా అధికారులు, పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బతుకమ్మ చీరలు అందని ద్రాక్షగా మారాయి.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి.. బహుమతులు గెలుపొందండి

బాన్సువాడ రూరల్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత గ్రామాలు, బంధు మిత్రుల వద్దకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి బహుమతులు పొందాలని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితాదేవి సూచించారు. ఈ నెల 21 నుంచి 23, అలాగే 28 నుంచి 30 వరకు బస్సుల్లో ప్రయాణించి తీసుకున్న టికెట్ వెనుకాల అడ్రస్, ఫోన్‌నెంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసే గిఫ్ట్ డ్రాప్‌బాక్స్‌లో వేయాలన్నారు. డ్రాలో గెలుపొందిన ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు రూ.9,900 విలువ చేసే బహుమతులు అందజేస్తామన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ షేక్ సలాం

కామారెడ్డి టౌన్: విద్యార్థుల తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియస్ కళాశాలలో నూతనంగా విచ్చేసిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండేళ్లు కష్టపడి, ఇష్టంగా చదవాలని కోరారు. చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. చెడిపోవాలన్నా, బాగుపడాలన్నా ఈ రెండేళ్లు కీలకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంఛార్జి ప్రిన్సిపాల్ నిజాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు ముమ్మరం



పెద్దకొడప్‌గల్ మండలం అంజనీ చౌరస్తాలో..



నిజాంసాగర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్ : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనాలను, అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.జిల్లాలోకి ప్రవేశించే వాహనాలతో పాటు జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో ఎన్నికల సామగ్రితో పాటు నగదు, మద్యంపై నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పేర్కొన్నారు.

డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలకు తరలిరావాలి



కామారెడ్డి అర్బన్: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 5వ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక(రజతోత్సవ) మహాసభలు ఈ నెల 15, 16, 17వ తేదీల్లో మహబూబ్ నగర్‌లో నిర్వహిస్తున్నందున ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌సీ ప్రభాకర్, బి.దేవులా పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉపాధ్యాయ సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, పేదలకు నాణ్యమైన ఉచిత విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. శుక్రవారం కామారెడ్డిలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీటీఎఫ్ నాయకులు కే.బాలయ్య, సాయిలు, నర్సింలు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త శంభురెడ్డి



కామారెడ్డిలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బాన్సువాడ : ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం సరస్వతి దేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త శంభూరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కాశీ సంతోష్‌శర్మ మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీశారదా ఆది శంకర ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారంగుల మహిపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పెంటయ్య, రాంరెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.